# సింగిల్ పేజీ కథలు

## హైటెక్ మోసం

'టైము నాలుగయ్యింది ఇంక పనిలోకి దిగాలి' అనుకుంటూ బయటకు చూశాను. పిల్లలు స్కూళ్లనుంచి అలసిన మొహాలతో, బండెడు బరువులతో ఇళ్లకు చేరుకుంటున్నారు. టపా ఏమైనా వచ్చిందేమోనని బయటకు వచ్చి బాక్స్ తెరిచి చూసా. ఏమీ రాలేదు. చుట్టూ కలయజూసా.

అందమైన పొదరిల్లు లాంటి చిన్న డాబా ఇల్లు. ఇంటి చుట్టూ పూలమొక్కలూ, పండ్లచెట్లూ. శ్రీవారు కళాశాలలో అధ్యాపకులు. ఇద్దరు ముత్యాలలాంటి పిల్లలు. పెళ్ళిళ్ళయ్యి ఉద్యోగ రీత్యా దూరాల్లో ఉంటున్నారు. ప్రస్తుతం మేమిద్దరమే. ఆయన ఉదయం పది గంటలకెళ్ళి సాయంత్రం అయిదు గంటలకల్లా వచ్చేస్తారు.

ఆయన వచ్చాక సాయంత్రం ఏ ఆరింటికో బయలుదేరి ఒక కిలోమీటరు దూరముండే గుడికి నడిచి వెళ్ళి వస్తాము. ఈవినింగ్ వాకింగ్ మరియు దైవ దర్శనమయిపోతుంది. అందులో ఈ రోజు ప్రత్యేకత కూడా ఉంది. మావారి పుట్టినరోజు. గబగబా అరటికాయలు తరిగి బజ్జీలు, సేమ్యా పాయసం చేసాను. శ్రీవారు వేం చేసారు.

"మొదట మీరు స్నానం చేసి రండి" అని తువ్వాలు ఆయనకిచ్చి, మిగతా పని పూర్తి చేసి నేను కూడా తయారయి ఆయన వచ్చాక బజ్జీల ప్లేటందించాను. ఏమిటి? విశేషమన్నట్లుగా ఆయన ప్రశ్నార్థకంగా చూస్తే, "అప్పుడే మర్చిపోయారా? ఈ రోజు మీ పుట్టినరోజు ప్రొద్దున్నే పిల్లలిద్దరూ గ్రీటింగ్స్ చెప్పారు కూడాను! మేము దూరంగా ఉన్నామని నాన్నగారు క్రొత్త బట్టలు వేసుకోరేమో? వేసుకోకపోతే నా మీదొట్టే అంటూ చెప్పింది మీ గారాల కూతురు. అందుకని అది పంపించిన లాల్చీ, పైజమా ఇవిగో వేసుకోండి. ఇది మీ పుత్రరత్నం పంపిన వాచీ" అన్నాను.

బట్టలు వేసుకుని, వాచీ పెట్టుకున్నాక బయలుదేరి పాండురంగస్వామి దర్శనం చేసుకుని అర్చన చేయించి మంటపంలో కూర్చున్నాము.

మా వెనుక వీధిలో ఉండే బామ్మగారు నెమ్మదిగా నడుచుకుని గుళ్ళోకి వస్తూ మమ్మల్ని చూసి పలకరింపుగా నవ్వి ముందుకు వస్తున్నారు. అప్పుడు జరిగిందో సంఘటన. ఎక్కడి నుంచి వచ్చాడో ఒక దొంగ భడవ రావడమేమిటి ఆ ముసలామె మెళ్ళో చంద్రహారం చటుక్కున లాక్కుని పరిగెట్టటమేమిటి... ఒక్కసారే జరిగాయి. మా వారు దొంగని పట్టుకోడానికి ప్రయత్నించారు కానీ ఈయన వయసుకి వాడిని పరిగెత్తి ఎక్కడ పట్టుకోగలరు? అప్పుడు ఒక నవయువకుడు ఇదంతా గమనించి తన బైక్ మీద ఆ దొంగని వెంబడించి పట్టుకుని, వాడికి నాలుగు అంటించి ఆ హారం పట్టుకుని బామ్మగార్కి ఇచ్చాడు. ఆ సంఘటనకి బిత్తరపోయి చూస్తున్న బామ్మగారికి కూల్‌డ్రింక్ త్రాగించి "మీ ఇల్లెక్కడో చెప్పండి బామ్మా.. నేను దిగబెడతాన"ని చెప్పి జాగ్రత్తగా తీసుకుని వెళ్ళాడు. ఇదంతా బొమ్మల్లా చూస్తున్న నేనూ మావారూ అమ్మయ్య ప్రపంచంలో ఇంకా మంచితనం ఉంది అని ఆనందించాము.

ఇది జరిగి రెండు మూడు రోజులయింది. మేము వాకింగ్‌కి వెళ్తూ, వస్తూ ఉన్నాము. కానీ రోజూ ఠంచనుగా గుడికొచ్చే బామ్మగారు రావటం లేదు. ఆ రోజు జరిగిన దానితో భయపడి బయటకు రావటం లేదేమో అని నేనే ఒకసారి పలకరించి వస్తేపోలా అనుకుని మావారు కాలేజీకి వెళ్ళాక అటుకేసి నడిచాను. నన్ను చూడగానే బామ్మగారు "రావే! అమ్మాయ్" అంటూ నీరసంగా పిలిచారు.

"ఏమైంది బామ్మగారూ? ఒంట్లో బాగాలేదా? రోజూ గుళ్ళోకి రావటం లేదు? ఆ రోజు అతను మిమ్మల్ని క్షేమంగా దింపాడు కదా!" అని అడిగాను కుర్చీలో. కూర్చుంటూ.

"ఆ రోజు చాలా పేద్ద... కథ జరిగిందే అమ్మడూ! ముందీ మంచినీళ్ళు తీసుకో!" అని గ్లాసందించి, తనూ త్రాగి మొదలు పెట్టారు.

"గుళ్ళో దొంగతనం అయి ఆగినా బావుండేదీ అమ్మడూ! వీడు పచ్చి దొంగ. వాడైతే హారమొక్కటే లాక్కెళ్ళేవాడు. వీడు రక్షించినట్లుగా మీ అందరి ముందూ నాటకం చేసి నన్ను బైక్ మీదెక్కించి తీసుకెళ్ళి మొత్తం హారం, గాజులు, చెవులవి అన్నీ దోచుకున్నాడు. ఇంటికి తీసుకెళ్ళకుండా వేరే దారిలో ఊరవతల తోటల్లోకి తీసికెళ్ళాడు. ఇటు తీసుకెళుతున్నావేమిటి ఆపు.. ఆపు.. అని లబలబలాడుతున్నా పట్టించికోకండా వేగంగా బండి తోలుకుని జన సంచారం లేని చోట ఆపాడు. అక్కడ నన్ను దిగమని జేబులోంచి కత్తి తీసి 'ఏయ్ బామ్మా నీ ఒంటి మీది నగలన్నీ ఇవ్వు' అని బెదిరించాడు. చీకటి పడుతోంది. పైగా ముసలిదాన్ని గజగజా వణుకుతూ అన్నీ తీసిచ్చాను. ప్రాణాలతో మాత్రం వదిలాడు. అక్కడి నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు నడిచాక టెలిఫోన్ బూత్ కనిపించింది. ఆలయంలో వేద్దామని కొంగున కట్టుకున్న చిల్లర డబ్బులతో మా అబ్బాయికి ఫోను చేసి, వాడొచ్చాక



కథా నిలయం

ఇంటికి తిరిగి వచ్చేసరికి నా తల ప్రాణాలు తోకకొచ్చాయి. అప్పటి నుంచీ బయటకు రావాలంటేనే భయంగా ఉంది. ఇంట్లో వాళ్ళు కూడా ఒక్కత్తివీ వెళ్ళద్దంటున్నారు. అందుకే రోజూ గుళ్ళోకి రావటం లేదు" అని చెప్పారు.

అంతా విన్నాక అయ్యో ఆ రోజు ఆ నయవంచకుడెంత నటించాడు. ఇది హైటెక్ యుగం కదా! హైటెక్ మోసం అనుకుంటూ ఇంటి ముఖం పట్టాను.

-జి.వాణి (హైదరాబాద్)


# ప్రాప్తం

"యువర్ ఎటన్షన్ ప్లీజ్... నెంబర్..." స్టేషన్లో ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ రావడానికి టైమయింది. ప్రయాణికులందరూ తమ లగేజీలతో సిద్ధంగా ఉన్నారు. మూర్తికి ప్రమోషన్ వస్తే తిరపతికొస్తానని మొక్కుకున్నాడు. మొక్కు తీర్చుకునేందుకు బయల్దేరాడు. అనుకున్నదే తడవు వాళ్ళ ఫ్రెండ్ మల్లిక్‌కు చెప్పి వాళ్ళని కూడా బయల్దేరదీసి ట్రైన్, కాటేజీ రిజర్వేషన్‌లు, దర్శనానికి విఐపి ఉత్తరాలు సేకరించి బయల్దేరారు. రైలులో ఇద్దరు ఫ్రెండ్స్ తమ కుటుంబాలతో సహా ఎక్కి సర్దుకుంటున్నారు. అలా పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు కాలక్షేపానికి. "ఏదో ఇలా ప్రాప్తమవుతోంది మాకు కూడా దైవ దర్శనానికి మీ దయవల్ల" అన్నాడు మల్లిక్.

"మా దయకేముంది అన్నయ్యగారూ... అదంతా తిరుమలేశుని దయ. దేనికైనా ప్రాప్తముండాలి" అంది మూర్తి భార్య సుజాత. ఆవిడకు కాస్త దైవచింతన ఎక్కువ. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటుంది. అలా రైలు స్టేషన్లను దాటుకుంటూ ప్రయాణిస్తోంది. ఏదో పెద్ద స్టేషను వస్తోందని భోజనాలు కానిద్దామని కేరియర్‌లు తీసి పిల్లలకు సర్దుతున్నారు. ఇంతలో మా ప్రక్క బెర్త్‌లలో ఉన్న జంట.. బహుశా క్రొత్తగా పెళ్ళయిన జంట. పెళ్ళయాక తిరుపతికి బయల్దేరినట్లున్నారు. ఆ అమ్మాయి కేరియర్ మూత రావట్లేదని, ఆయనకిచ్చి తీయమంది. వేడి పదార్థాలుంచిన తరువాత వెంటనే మూత పెట్టడం వల్లనేమో అది కాస్తా బిగుసుకుపోయి తెరుచుకోలేదు. ఆయన ప్రయత్నించి, కొంచెం బలప్రయోగం చేసే సరికి అది ఎగిరిపడి పదార్థాలన్నీ చెల్లా చెదురుగా క్రింద పడిపోయాయి. పాపం బిక్క మొహం వేసుకుని వాటన్నిటిని వేస్టు పేపరుతో ప్రక్కకు తుడిచి, ఏమైనా తినడానికి దొరుకుతుందేమో అని ఎదురు చూస్తున్నారు. సుజాత ఆ పరిస్థితిలో వాళ్ళని చూసి, తమ దగ్గర ఉన్న వాటిని వాళ్ళక్కూడా ప్లేట్‌లోపెట్టి ఇస్తే కొంత మొహమాటపడి, ఆఖరుకి తీసుకున్నారు. భోజనాలయాక ఎఫ్‌ఎం రేడియోలో సినీకవిగారి పాట వినపడ్తోంది 'కతికేటి మెతుకే నీదయితే విధి చెక్కుతుందీ నీ పేరే...'

ООО

తిరుపతి దర్శనం బాగా అయింది. రెండు సార్లు దర్శనాలయాక చుట్టు ప్రక్కల అన్ని తీర్థాలు చూశాక, ప్రసాదాలు ఎక్కువగా కొనుక్కొని, టేక్సీలో క్రింది తిరుపతికి తిరుగు ప్రయాణం అయారు. ఘాట్‌రోడ్‌లో క్రిందకి దిగి, సామాన్లు తీసుకుని ట్రైన్‌లో సర్దుకున్నారు అప్పుడు చూసుకునేసరికి ప్రసాదాల బేగ్ కనపడలేదు. బహుశా టేక్సీలోనే ఉండిపోయిందేమో? తిరుపతి లడ్డుకున్న



మహత్యం చేత మళ్ళీ ప్రయత్నించుదామన్నా, రిజర్వేషన్ కన్‌ఫరమ్ అవడంచేత, బాధని దిగమింగుకుని బయల్దేరేము. ఏం తప్పు చేసాము స్వామి? మాకిలాంటి శిక్ష వేశావు? అని సుజాత వందసార్లయినా అనుకుంది. మనకి ప్రసాదం ప్రాప్తం లేదేమో అనుకుని స్థిమితపడింది. లేకపోతే విఐపి ఉత్తరంతో మరిన్ని లడ్లు కొనుక్కుని, అక్కడ తినకుండా ఇంటికెళ్ళి పూజ చేసి తినాలని మరీ లడ్డూలను భద్రం చేసినా, తినడానికి ప్రాప్తం లేకుండా పోయిందని తెగ బాధపడిపోయి, అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నారందరూ...

ООО

చిన్నగా తెల్లవారుతోంది. సుజాతకు మాత్రం కలతనిద్రే. తెల్లవారుతుండగా కునుకు పట్టినట్లయింది. రైలు అన్నవరం దాటింది. ఇక ఒక్కొక్కరు నిద్రలేస్తున్నారు. మొహాలు కడుక్కొని ఫ్రెష్ అవుతున్నారు. మా బెర్త్‌లపై ఎవరో వచ్చి కూర్చున్నట్లున్నారు. పగలు కదా అని సరిపెట్టుకున్నాము. అలా వాళ్ళు కొంచెం సేపుండి ఏదో స్టేషన్లో దిగి వెళ్ళిపోయారు. అదో పెద్ద బృందంలా వుంది. మేం కూడా ఇక దిగడానికి అన్నీ సర్దుకుంటుండగా అప్పుడు కనిపించిందో పెద్ద ప్లాస్టిక్ కవరు- 'సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం, అన్నవరం' అని ఆ కవరు మీద వుంది. ఎవరిదో ఆ కవరు అని అక్కడున్న వాళ్లందర్నీ అడిగినా ఫలితం లేదు. కవర్లో చూస్తే 8 పేకెట్ల స్వామివారి 'ప్రసాదం'. ఉదయాన్నే వ్రతం చేయించుకున్నట్లుంది- ప్రసాదం ఇంకా వేడిగానే వుంది. నా గుండె ఝుల్లుమంది. స్వామి వారికి మా మీద దయ కల్గిందా? ఈ రూపంలో ప్రసాదాన్ని పంపారా? తిరుపతిలో పోగొట్టుకున్న ప్రసాదం, ఇలా మళ్ళీ ఈ రూపంలో మాకు ప్రాప్తించిందా? ప్రతి మెతుకు మీద తినేవాడి పేరుండడం అంటే ఇదేనా? భగవత్కటాక్షం మాకుందా? నిజంగానే స్వామి మమ్మల్ని కరుణించేరా? ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తోంది సుజాత. మళ్ళీ మనసులో చిన్న అనుమానం. ఈ సంచికోసం ఎవరైనా వస్తారేమో... అని. రైలు దిగి ఇంటికి వెళ్ళి ప్రసాదాన్ని పంచుకుని తిని మళ్ళీ మొక్కుకుంది సుజాత 'వ్రతం చేయించుకోవడానికి నీ కొండకు రావడానికి ప్రాప్తం కలగాలని'

-ఎ.వి.రాధాకృష్ణమూర్తి
(విశాఖపట్నం)